# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

MHR TV

మెదక్ | సంపుటి: 19 సంచిక : 156 | ఆదివారం 08, ఫిబ్రవరి 2026 | పేజీలు: 06 వెల: రూ.1

Circulated By: Hyderabad-Medak-Sangareddy-Nalgonda-Warangal-Nizamabad-Adilabad -Vijayawada-Guntur-Vizag-Kurnool | www.prajaswaramdaily.com





## ఫోరెన్సిక్ ల్యాబ్ లో భారీ అగ్ని ప్రమాదం

# బూడిదైన ఎవిడెన్స్

**రాజకీయ నేతల కేసుల్లో ఎవిడెన్స్ బుగ్గిపాలు**

**షార్ట్ సర్క్యూట్ అంటున్న పోలీసులు**

**14 ఏండ్ల రికార్డులు**

**మొత్తం అగ్నికి ఆహుతి**

**గతంలో రేవంత్ రెడ్డి ఓటుకు నోటు కేసు..**

**బీఆర్ఎస్ హయాంలో ఎమ్మెల్యేల కొనుగోలు..**

**ఫోన్ ట్యాపింగ్ కేసుల ఫైళ్లు బూడిద**

**అగ్ని ప్రమాదంపై అన్నీ అనుమానాలు**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** రాష్ట్రంలో జరిగే ప్రతి కేసు ఫైల్ ఇక్కడకు రావాల్సిందే. ప్రధానంగా రాజకీయపరమైన కేసులకు ఇంకా ఇది కచ్చితమైన కేంద్రం. అటు వీడియోలు, ఆడియో రికార్డులపై నిగ్గు తేల్చే ప్రాంతం. అదే తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్, రాష్ట్రంలో హీట్ పెంచిన ఆనాటి సెబాస్టియన్ కేసు నుంచి

...మిగతా 3లో

## కేసీఆర్ వల్లే రంగారెడ్డి జిల్లాకు

# అన్యాయం

**మరో ఎనిమిదేళ్లు రాష్ట్రంలో ఇందిరమ్మ పాలన**

**ఎవరెన్ని కుట్రలు చేస్తారో చేయండి.. చూద్దాం**

**రంగారెడ్డికి గోదావరి నీళ్లు ఇవ్వాలన్న ఆలోచన కేసీఆర్‌కు రాలేదు**

**గోదావరి జలాలతో తాండూరు, వికారాబాద్ పరిగి ప్రజల కాళ్లు కడుగుతా**

**తాండూరులో కాగ్నా నీళ్లు పారిస్తా**

**వచ్చే మూడేళ్లలో మక్తల్ – నారాయణపేట – కొడంగల్ ఎత్తిపోతల పూర్తి**

**అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా వికారాబాద్**

**పరిగి బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మన పూర్వపు రంగారెడ్డి జిల్లా ఎలాంటి అభివృద్ధికి నోచుకోకపోవడం కేసీఆర్ నిర్లక్ష్యానికి నిదర్శనమేనని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. పరిగి మండలం నారాయణపూర్ గ్రామ శివారులో శనివారం నిర్వహించిన ప్రజాపాలన ప్రగతి బాట బహిరంగ సభకు సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా పాలనలో ఎన్నో సంక్షేమ పథకాలు అభివృద్ధి చేస్తూ కేసీఆర్ పుణ్యమా అంటూ అప్పుల్లో కూరుకుపోయిన తెలంగాణను ఇప్పుడిప్పుడే బయటికి

...మిగతా 3లో





## చేతకాకపోతే రాజీనామా చేయ్

**సీఎం రేవంత్ కు కేంద్రమంత్రి కిషన్ రెడ్డి డిమాండ్**

**కేసీఆర్‌పై చర్యలు తీసుకోకుండా ఎవరు అడ్డుకుంటున్నారో సీఎం చెప్పాలి**

**రేవంత్ రెడ్డే కేసీఆర్‌ను కాపాడుతున్నడు**

**గతంలో అసదుద్దీన్ బుల్లెట్‌పై కేసీఆర్, ఇప్పుడు రేవంత్**

**కేసీఆర్‌పై చర్యలు తీసుకునే దమ్ము లేని సీఎం రేవంత్ రెడ్డి..**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఫోన్ ట్యాపింగ్, కాళేశ్వరం, ఇతర కుంభకోణాల్లో కేసీఆర్ పై చర్యలు తీసుకునే దమ్ము అసలు రేవంత్ రెడ్డికి ఉందా..? లేదా? అని ప్రశ్నించారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకునే దమ్ము రేవంత్ రెడ్డికి ఉంటే.. బహిరంగ

...మిగతా 2లో

## లోక్ సభ ఎన్నికల తర్వాత ఈటలకు ప్రాధాన్యం తగ్గుతోందా?

**లోక్‌సభ ఎన్నికల తర్వాత ఈటలకు ప్రాధాన్యం తగ్గుతోందా?**

**పనిగట్టుకుని కొందరు తగ్గించే ప్రయత్నం చేస్తున్నారా?**

**మల్కాజ్‌గిరి ఎంపీ అయ్యాక హుజూరాబాద్‌కు గెస్ట్**

**పంచాయతీ ఎన్నికల టైంలో హుజూరాబాద్‌లో యాక్టివ్**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):** తెలంగాణ బీజేపీలో తన ప్రాధాన్యం తగ్గిపోతున్నట్టు ఎంపీ ఈటల రాజేందర్ ఫీలవుతున్నారా? ఇక లాభం లేదు, తాడో పేడో తేల్చేసుకోవాలని డిసైడయ్యారా? కొందరు పనిగట్టుకుని తనను బద్నాం చేస్తున్నట్టు ఆయన భావిస్తున్నారా? ఏ విషయంలో ఎంపీ ఆ స్థాయిలో హర్ట్ అయ్యారు? ఇన్నాళ్లు కాస్త అటు ఇటుగా ఉన్నా... ఇప్పుడెందుకు అంత సీరియస్ అవుతున్నారు?

...మిగతా 3లో

## త్వరలోనే మలేషియాలో తొలి భారత కాన్సులేట్...

**మలేషియాలో పర్యటిస్తున్న ప్రధాని మోదీ**

**ఆరో తరం మలేషియా భారతీయులకూ ఓసీఐ కార్డుల అర్హత**

**యూనివర్సిటీ మలయాలో తిరువళ్లువర్ సెంటర్ ఏర్పాటు**

**కౌలాలంపూర్‌లోని భారతీయ కమ్యూనిటీ కార్యక్రమంలో మోదీ**

**భారత్-మలేషియా బంధాన్ని 'ఇంపాక్ట్'గా అభివర్ణించిన ప్రధాని**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):** భారత్, మలేషియా మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రధాని నరేంద్ర మోదీ కీలక ప్రకటన చేశారు. మలేషియాలో త్వరలోనే తొలి భారత కాన్సులేట్‌ను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. శనివారం కౌలాలంపూర్‌లో జరిగిన 'సెలామత్ దతాంగ్ మోదీజీ' కార్యక్రమంలో ఆయన

...మిగతా 2లో

## 60 సీట్లున్న బస్సులో 100 మంది ఎక్కితే గొడవలు కావా?

**మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామన్న జగ్గారెడ్డి**

**ఉచిత బస్సు పథకంపై ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం**

**ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినా ప్రభుత్వం హామీలను నెరవేరుస్తోందని వ్యాఖ్య**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. అయితే ఉచిత బస్సు పథకంతో మహిళలు ఘర్షణలకు దిగుతున్నారంటూ ప్రతిపక్షాలు రాద్ధాంతం చేస్తున్నాయని మండిపడ్డారు. 60 సీట్లు ఉన్న బస్సులో 100 మంది ఎక్కితే గొడవలు కావా అని వ్యాఖ్యానించారు. ప్రతిపక్షాలు ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేయడం సరికాదని అన్నారు. బియ్యం తక్కువ ఉన్నా

...మిగతా 2లో




## మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ జైత్రయాత్రే..

**ప్రతిపక్షాలపై తుమ్మల ఘాటు విమర్శలు**

**బీసీ కులగణన, ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ ఫోకస్**

**పేదలకు సన్నబియ్యం, సంక్షేమ పథకాలతో ప్రజాదరణ**

**మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ ఘన విజయం ఖాయం**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):** సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ వేదికగా జరిగిన మీడియా సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు ప్రతిపక్షాలపై తీవ్రస్థాయిలో

...మిగతా 2లో

## ముస్లిం మహిళలు ఏకం కావాలి

**ట్రిపుల్ తలాక్ రద్దుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ వ్యతిరేకం?**

**ముస్లిం మహిళల సమస్యలపై ఒవైసీ ఎన్నడూ మాట్లాడలేదు?**

**బీజేపీతోనే దేశాభివృద్ధి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్**

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** ముస్లిం మహిళలంతా ఏకమై బీజేపీని గెలిపించాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ పిలుపునిచ్చారు. ట్రిపుల్ తలాఖ్ రద్దు వల్ల ముస్లిం మహిళలకు మేలు జరిగిందా? లేదా? అనే విషయంపై ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ సమాధానం చెప్పాలని బండి సంజయ్ కుమార్ ప్రశ్నించారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం కరీంనగర్ లోని బుట్టి రాజారాం కాలనీలో కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో నగరంలోని 25, 26, 27

...మిగతా 2లో



## ఆధిపత్యం కావాలా? అభివృద్ధి కావాలా?

**పదేళ్లలో తూప్రాన్ రూపురేఖలు మార్చింది కేసీఆర్..**

**నేడు గుంతల రోడ్లకు డాంబర్ వేసే దిక్కులేదు.**

**200 ఉన్న ఇంటి పన్నును 1000 చేసి పేదోడి నడ్డి విరిచారు.**

**ఆసుపత్రి ఉంది కానీ డాక్టర్లు లేరు.. తూప్రాన్ రోగులను గాలికి వదిలేశారు.**

**నాడు నీళ్ల కోసం బిందెల యుద్ధం.. నేడు ఇంటింటికి నల్లా ఇచ్చిన కేసీఆర్.**

**పువ్వు గుర్తుకు ఓటేసినా.. మోరీలో పారేసినా ఒక్కటే.**

**రేవంత్ రెడ్డి బూతుల ముఖ్యమంత్రి.. అతను ఒక బూతు పిత..**



**హైదరాబాద్, (ప్రజాస్వరం):** రెండున్నరేండ్ల కాంగ్రెస్ పాలనలో పాలు, నీళ్లు ఏమిటో ప్రజలకు అర్థమైందని డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు అన్నారు. ఎవర్ని అడిగినా రేవంత్ పాలన ఎలా ఉందో చెబుతున్నారని తెలిపారు. గజ్వేల్ మున్సిపాలిటీలో శనివారం నాడు హరీశ్‌రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇందిరాపార్క్, ఎంపీడీవో

...మిగతా 2లో

## 60 సీట్లున్న బస్సులో 100 మంది ఎక్కితే
# గొడవలు కావా?

**మొదటిపేజీ తరువాయి**



తినేవాళ్లు ఎక్కువగా ఉన్న చందంగా ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం పరిస్థితి ఉందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగా లేకపోయినప్పటికీ తమ ప్రభుత్వం క్రమంగా అన్ని హామీలను నెరవేరుస్తోందని అన్నారు. సంగారెడ్డి మున్సిపాలిటీలో అన్ని వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ కౌన్సిలర్లను గెలిపిస్తే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి పనులు చేయిస్తానని హామీ ఇచ్చారు.

ఒక్కో వార్డుకు రూ.8 కోట్లు మంజూరు చేయిస్తానని జగ్గారెడ్డి అన్నారు. సంగారెడ్డిలో అన్ని వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపిస్తే రూ.300 కోట్లు తీసుకువస్తానని అన్నారు. 2013లో 5,500 మందికి ఇంటి స్థలాలు ఇచ్చానని గుర్తు చేశారు. గత పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉందని, ఇప్పుడు మళ్లీ కాంగ్రెస్ అధికారంలో ఉన్నందున కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి ఇంటి స్థలాలు ఇప్పిస్తానని స్పష్టం చేశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తన భార్య ఎమ్మెల్యేగా పోటీ చేస్తుందని ప్రకటించారు. తాను కాంగ్రెస్ పార్టీ కోసం తెలంగాణ మొత్తం తిరుగుతానని అన్నారు.

# కేసీఆర్ వల్లే రంగారెడ్డి జిల్లాకు అన్యాయం

**మొదటిపేజీ తరువాయి**

తీసుకు వస్తున్నామన్నారు. పేద మధ్య తరగతి ప్రజల అభివృద్ధి ధ్యేయంగా పని చేస్తూ కడుపు నిండా మూడు పూటలా భోజనం చేసేందుకు మొదట రేషన్ కార్డు శ్రీకారం చుట్టామన్నారు. స్థానికంగా ప్రజల కష్ట నష్టాలు తెలుసుకొని మేము అధికారం చేపట్టాక ఒక్కొక్కటి నెరవేరుస్తూ వస్తున్నామన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ , ఉచిత బస్సు సౌకర్యం, ఇందిరమ్మ ఇల్లు తదితర సంక్షేమ పథకాలను చూసి స్థానిక సర్పంచ్ ఎన్నికల్లో మంచి మెజారిటీ ఇచ్చారన్నారు.

మళ్లీ మున్సిపల్ ఎన్నికల రాగానే మేమున్నామంటూ ఉనికి చాటుకునేలా బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు కౌన్సిలర్లుగా పోటీ చేస్తున్నారన్నారు. అభివృద్ధి సంక్షేమం ప్రజల అవసరాలను గుర్తించి పాలన కొనసాగిస్తూ బలపరిచిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మీ విలువైన ఓటును వేస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని తెలియజేశారు. వికారాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని మున్సిపల్ లో మెజార్టీ ఓట్లతో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను కౌన్సిలర్లుగా గెలిపించాలని ఆకాంక్షించారు. వికారాబాద్ జిల్లా అభివృద్ధి విషయానికి వస్తే కేరాఫ్ అడ్రస్ గా పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి పట్టుబట్టి అప్ప జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నాలుగు లైన్ల రహదారి, పరిగి వికారాబాద్ , పరిగి షాద్నగర్ రోడ్లు శరవేగంగా అభివృద్ధి చేస్తున్నామన్నారు. మున్సిపల్ లో స్థానిక సమస్యలను కూడా పరిష్కరించాలంటే మన పార్టీ బలపరిచిన అభ్యర్థులను అధిక మెజారిటీతో గెలిపిస్తే ఎక్కువ నిధులు కేటాయిస్తానని తెలియజేశారు.

జిల్లాకు నీటి సౌకర్యాన్ని కల్పించే అవసరం ఉందన్నారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో కోట్ల రూపాయలత జిల్లాకు గోదావరి నీటిని ఖచ్చితంగా తీసుకువస్తానని సీఎం హామీ ఇచ్చారు. కాగ్నా నది ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టి తాండూర్ ప్రాంత ప్రజలకు నీటి సౌకర్యాన్ని కల్పిస్తానని తెలిపారు. ఎన్ని కోట్ల నిధులు కావాలంటే అన్ని నిధులను వెచ్చించి అయిన రోడ్ల నిర్మాణాల పనులను చేపడతామన్నారు. మూసి ప్రక్షాళన చేసేందుకు ప్రభుత్వం ముందుకు వస్తే దాన్ని అడ్డుకునేందుకు కొందరు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. మున్సిపల్ లో ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలని దురుద్దేశంతో తాండూరులో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో బీజేపీ అభ్యర్థికి బి ఫాం అందజేసే స్థితికి దిగజారారన్నారు.



రైతు భరోసాలో భాగంగా రైతుల ఖాతాల్లోకి జమ చేశారని ముఖ్య మంత్రి తెలిపారు. నిరుద్యోగ సమస్యను పరిష్కరించే దిశగా 70 వేల ఉద్యోగాలు కల్పించారని ఆయన తెలిపారు. 9 వేల కోట్ల రూపాయలను మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారని ఆయన తెలిపారు. ఇండ్లు లేని పేదలకు ఇళ్ల నిర్మాణాలు చేపట్టి వారికి ఆత్మ గౌరవాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని 6650 స్వయం సహాయక సంఘాల మహిళలకు ఇందిరా మహిళా శక్తి 567.69 కోట్ల రూపాయల చెక్కులను అందజేశారు. శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ వికారాబాద్ జిల్లాకు టెక్స్ టైల్ పార్కు, అనంతగిరి టూరిజం డెవలప్మెంట్ కోసం 1000 కోట్లు కేటాయించాలన్నారు. వికారాబాద్ నియోజకవర్గానికి అదనంగా 5 వేల ఇండ్లు కేటాయించాలన్నారు.

ఎంఎంటీసీ రైల్ వికారాబాద్ వరకు పొడిగించాలన్నారు. జిల్లా ఇన్చార్జి మంత్రి దుద్దిల శ్రీధర్ బాబు మాట్లాడుతూ పరిగి నియోజకవర్గం వికారాబాద్ జిల్లా పై చిత్తశుద్ధి ఉన్న నాయకుడు పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి అని తెలియజేశారు. నాలుగు లైన్ల రహదారి ఇంత కోరిక దిన పూర్తి కావస్తుందంటే అది టి. రామ్మోహన్ రెడ్డి పుణ్యమైన అని తెలియజేశారు. అసెంబ్లీ సమావేశాలు జరగాలంటే ఎమ్మెల్యే టి.రామ్మోహన్ రెడ్డి ఈ నియోజకవర్గ అభివృద్ధి గురించి చర్చించే మొదలు పెడతారన్నారు. శాసనమండలి చీఫ్ విప్ మహేందర్ రెడ్డి మాట్లాడుతూ అభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీ బలపరిచిన కౌన్సిలర్లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పరిగి ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి మాట్లాడుత మన జిల్లా నుంచే సీఎం, స్పీకర్ ఉన్నారని కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను మున్సిపల్ లో గెలిపిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని ఎమ్మెల్యే టి రామ్మోహన్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బుయ్యని మనోహర్ రెడ్డి, కాలే యాదయ్య, ప్రకాష్ గౌడ్, ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాత, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్ రెడ్డి, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ జైత్రయాత్రే..

**మొదటిపేజీ తరువాయి**



విరుచుకుపడ్డారు. మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి పాల్గొన్న ఆయన, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో గత రెండు సంవత్సరాలుగా అసాధ్యమని భావించిన ఎన్నో సమస్యలను తమ ప్రభుత్వం పరిష్కరించిందని స్పష్టం చేశారు. కేవలం అసూయతోనే ప్రతిపక్షాలు అసత్య ప్రచారాలు చేస్తున్నాయని, ప్రజలు వారిని ఎప్పుడో తిరస్కరించారని ఆయన ఎద్దేవా చేశారు.

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన విప్లవాత్మక నిర్ణయాలను మంత్రి తుమ్మల ఈ సందర్భంగా గుర్తు చేశారు. దేశంలోనే మొట్టమొదటిసారిగా బీసీ కులగణన చేపట్టిన ఘనత తమ ప్రభుత్వానిదేనని ఆయన గర్వంగా ప్రకటించారు. తెలంగాణను ఆదర్శంగా తీసుకునే నేడు కేంద్ర ప్రభుత్వం కూడా తలవంచి కులగణన చేపట్టబోతోందని ఆయన పేర్కొన్నారు. అలాగే ఎస్సీ వర్గీకరణ (A, B, C, D) విషయంలో దశాబ్దాల నాటి కల సాకారం చేస్తూ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని వివరించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ. 13,000 కోట్లు వెచ్చించి పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని ఆయన వెల్లడించారు.

గత పదేళ్ల పాలనలో ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిన వారే నేడు నీతులు మాట్లాడుతున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. "రైతాంగం, పేదలు, నిరుద్యోగులు సంతోషంగా ఉంటే ఓర్వలేక ప్రతిపక్షాలు కారుకూతలు కూస్తున్నాయి. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ , పంచాయతీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పని అయిపోయిందని ప్రచారం చేశారు, కానీ ప్రజలు తమ ఓటుతో మమ్మల్ని ఆశీర్వదించి వారికి బుద్ధి చెప్పారు" అని తుమ్మల గుర్తు చేశారు. ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లో కూడా అదే స్థాయిలో ప్రతిపక్షాల విమర్శలకు ప్రజలు సమాధానం చెబుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

రాష్ట్ర అభివృద్ధి విషయంలో కేంద్ర ప్రభుత్వం ఆశించిన స్థాయిలో సహకరించకపోయినప్పటికీ, అవసరమైతే తల తాకట్టు పెట్టయినా సరే అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని మంత్రి తుమ్మల తేల్చి చెప్పారు. తాము చేసే పనులే తమకు రక్షణ అని, కాంగ్రెస్ పార్టీ ఎవరి విమర్శలకూ బెదరదని ఆయన స్పష్టం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో 100 శాతం కాంగ్రెస్ పార్టీ విజయం సాధించబోతోందని ఆయన జోస్యం చెప్పారు.

# ఆధిపత్యం కావాలా? అభివృద్ధి కావాలా?

**మొదటిపేజీ తరువాయి**

చౌరస్తా వద్ద నుంచి రోడ్ షోలో ప్రసంగించారు. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడుతూ.. జానెడు సీసీ రోడ్డు పోయలేదని.. మోరీ కట్టలేదని.. కనీసం ఒక్క రూపాయి పని కూడా గజ్వేల్‌లో చేయలేదని విమర్శించారు. గజ్వేల్ అభివృద్ధి చేసిండు అని కేసీఆర్ ను ప్రతిపక్షాలు తిట్టినయి. మరి కేసీఆర్‌ను మనం కడుపులో పెట్టుకోవాలన్నా వద్దా? అని ప్రశ్నించారు. ఒకప్పుడు గజ్వేల్‌కు ఉత్తరం పోస్టు చేస్తే గద్వాలకు పోయేదని సమైక్యాంధ్రలోని దీనస్థితిని గుర్తు చేశారు. కానీ ఇప్పుడు గజ్వేల్ అంటే అభివృద్ధిలో జిగేల్ అని అన్నారు. కేసీఆర్ గజ్వేల్ గౌరవం పెంచాడని కొనియాడారు.

ఎన్నికల ప్రచారం సందర్భంగా కాంగ్రెస్ నాయకులపై హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. రోడ్డు పొక్కల్లో ఇంత డాంబర్ వేసే తెలివిలేని దద్దమ్మలు కాంగ్రెస్ పాలకులని విమర్శించారు. వీళ్లకు గజ్వేల్ లో ఓటు కావాలని తిరుగుతున్నారని మండిపడ్డారు. గజ్వేల్‌లో కేసీఆర్‌ను ఓడగొట్టాలని రేవంత్ రెడ్డి కట్టలు కట్టలు పంపాడట అని ఆరోపించారు. ఆ పైసలు మనల్ని కొట్టి కమాయించినవే.. ఎవరు ఎన్నిఇచ్చినా అవే మా పైసలే అనుకొని తీసుకోవాలని సూచించారు. కానీ ఎన్నికల్లో బీఆర్ఎస్ కు ఓటు గుద్ది కాంగ్రెస్ కు గుణపాఠం చెప్పాలె అని పిలుపునిచ్చారు.



# త్వరలోనే మలేషియాలో తొలి భారత కాన్సులేట్...

**మొదటిపేజీ తరువాయి**

ఈ ప్రకటన చేశారు. ఈ కార్యక్రమానికి మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంతో కలిసి మోదీ హాజరయ్యారు.

కాన్సులేట్ ఏర్పాటు నిర్ణయంతో ఇరు దేశాల మధ్య బంధం మరింత బలపడుతుందని ప్రధాని మోదీ తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో పేర్కొన్నారు. ఈ చొరవతో మలేషియాలోని భారతీయ సమాజంతో సంబంధాలు మరింత విస్తృతం అవుతాయని భారత విదేశాంగ శాఖ (MEA) తెలిపింది. ప్రధాని ప్రకటనపై అక్కడి ప్రవాస భారతీయులు హర్షం వ్యక్తం చేశారు. అంతకు ముందు ఆరో తరం వరకు ఉన్న మలేషియాలోని భారత సంతతి పౌరులకు ఓవర్సీస్ సిటిజన్‌షిప్ ఆఫ్ ఇండియా (OCI) కార్డుల అర్హతను పొడిగించడంపై ప్రవాస భారతీయులు సంతోషంగా ఉన్నారని మోదీ తెలిపారు.

ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ, మలేషియా అభివృద్ధికి, ఇరు దేశాల స్నేహాన్ని బలోపేతం చేయడంలో భారత సంతతి ప్రజల పాత్రను కొనియాడారు. భారత్‌మలేషియా భాగస్వామ్యాన్ని ఆయన 'ఇంపాక్ట్' (IMPACT - India Malaysia Partnership For Advancing Collective Transformation)గా అభివర్ణించారు. ఆజాద్ హింద్ ఫౌజ్ చరిత్రను గుర్తుచేసుకుంటూ నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు నివాళులర్పించారు. ఆహారపు అలవాట్ల నుంచి భాష వరకు ఇరు దేశాల మధ్య అనేక సాంస్కృతిక సారూప్యతలు ఉన్నాయని గుర్తుచేశారు.

ఈ పర్యటనలో భాగంగా మరికొన్ని కీలక ప్రకటనలు కూడా చేశారు. కౌలాలంపూర్‌లోని యూనివర్సిటీ మలయాలో ప్రత్యేకంగా 'తిరువళ్లువార్ సెంటర్' ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. దీంతో పాటు విద్యార్థుల కోసం తిరువళ్లువార్ స్కాలర్‌షిప్‌లను కూడా అందిస్తామని హామీ ఇచ్చారు. భారత్ ఆర్థికంగా వేగంగా అభివృద్ధి చెందుతోందని, త్వరలోనే యూపీఐ చెల్లింపుల సౌకర్యం మలేషియాలోనూ అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా 800 మంది కళాకారులతో ప్రదర్శించిన భారత సంప్రదాయ నృత్య ప్రదర్శన మలేషియన్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం సంపాదించడం విశేషం.




# ముస్లిం మహిళలు ఏకం కావాలి

**మొదటిపేజీ తరువాయి**

డివిజన్ల బీజేపీ అభ్యర్థులు కటకం లోకేశ్, డాక్టర్ పుల్లెల ప్రవీణ్, చాడ ఆనంద్ సతీమణి తంబాల నవ్యశ్రీలను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆదర్శనగర నుంచి కోర్టు చౌరస్తా వరకు స్మార్ట్ సిటీ నిధులతోనే మెయిన్ రోడ్డు నిర్మించామని, 26వ డివిజన్లో ఇంటర్నల్ రోడ్స్ చాలా వరకు కేంద్ర నిధులతోనే నిర్మించామని అన్నారు. ముఖ్యంగా సుభాష్ నగర్ ప్రభుత్వ పాఠశాలను కోటి రూపాయలతో మోడల్ స్కూల్ గా మార్చామని చెప్పారు.

25వ డివిజన్లో పెద్దగా అభివృద్ధి కన్పించడం లేదని, కాంగ్రెస్, బీఆర్ఎస్ ఒకటేనని అన్నారు. అభివృద్ధి చెందాలంటే బీజేపీని గెలిపించాలని కోరారు.

25, 26, 27 డివిజన్లలో పోటీ చేస్తున్న మా బీజేపీ అభ్యర్థులు కటకం లోకేష్, డాక్టర్ పుల్లెల పవన్, తంబాల నవ్యశ్రీ చాడ ఆనంద్ గుణవంతులని వారిని గెలిపిస్తే కంటికి రెప్పలా కాపాడుకుంటారని అన్నారు. బీజేపీని గెలిపించి మేయర్ పీఠం అప్పగిస్తే అభివృద్ధిలో మీ డివిజన్ల రూపురేఖలు మారుస్తారని తెలిపారు.



# బ్యాక్ డోర్‌లో బ్యాక్ లాగ్ ఉద్యోగాల భర్తీకి కుట్రలు

**హైదరాబాద్, (ప్రజాస్వరం):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత నిరుద్యోగ యువత నోట్లో మట్టికొందని, బ్యాక్ డోర్‌లో బ్యాక్‌లాగ్‌నియమాకాలు చేస్తుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విరుచుక పడ్డారు. మున్సిపల్, రెవెన్యూ, నీటిపారుదల, విద్యుత్‌శాఖల్లో దొడ్డిదారిన ఉద్యోగాలు భర్తీ చేసేందుకు కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. నిరుద్యోగం యువత ప్రభుత్వం ఎప్పుడు ఉద్యోగాల నోటిఫికేషన్స్ వేస్తుందా అని ఎదురు చూస్తున్నారని సర్కార్‌కొలువుల కోసం గ్రామాల నుంచి ఎంతో మంది యువకులు హైదరాబాద్ వచ్చి శిక్షణ పొందుతూ వేల రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపారు. శనివారం ఒక ప్రకటనలో పేర్కొంటూ తెలంగాణ వస్తే తమకు ఉద్యోగాలు వస్తాయని యువత ఉద్యమంలో బలంగా కొట్లాడితే తెలంగాణ వచ్చాక చిన్నపాటి ఉద్యోగాలు తప్ప పెద్ద పోస్టుల భర్తీ జరగలేదన్నారు. ఒక క్రమపద్ధతిలో పరీక్షలు నిర్వహించలేదని, ఒకే విద్యార్థి రకరకాల ఉద్యోగాలకు పరీక్ష రాయకుండా ఒకే రోజు రెండు పరీక్షలు నిర్వహించారు.

ఆగ్రహం చెందిన యువత బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దె దింపితే న్యాయం జరుగుతుందని భావించింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో యువత గ్రామాల్లో తిరిగి ఓటర్ల కాళ్లు పట్టుకొని కాంగ్రెస్ కు ఓటు వేయించింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక జాబ్ క్యాలెండర్ వస్తుందని నమ్మారు. ఏ నెలలో ఏ జాబ్ వస్తుందో కూడా స్పష్టత లేని పరిస్థితి ఉంది. బీఆర్ఎస్ ఉన్నప్పుడు స్టేట్ లెవల్ పోస్టులను కూడా ప్రొవిజన్ అనే చిన్నపదాన్ని పట్టుకొని పరీక్షలు లేకుండానే ఉద్యోగం ఇచ్చారు. లక్షన్నర జీతం ఉన్న ఉద్యోగాలను బోయినపల్లి సరితతో పాటు చాలా మందికి వచ్చినట్లు ప్రచారం జరిగిందన్నారు. నిర్మల్ లో కూడా జిల్లా స్థాయిలో ఉన్న 44 పోస్టులను రూ. 10 నుంచి 15 లక్షలకు అమ్ముకున్నారని ఆరోపించారు. దీనిపై యువత పోరాటం చేస్తే ఆ నియమాకాలను నిలిపివేశారు. అప్పుడు కాంట్రాక్ట్ పద్ధతిలో చేరిన వాళ్లు ఇంకా ఉన్నారని వాళ్లకు న్యాయం జరగలేదు.

అప్పటి బీఆర్ఎస్ నాయకులే ఇప్పుడు కాంగ్రెస్ లో చేరి న్యాయం జరగకుండా అడ్డుపడుతున్నారు. రాజకీయాలను యువత కచ్చితంగా గమనించాల్సిన అవసరం ఉంది. నిజామాబాద్, కామారెడ్డి, ఆదిలాబాద్ నిర్మల్ సహా చాలా



జిల్లాల నుంచి యువత మా వద్దకు వచ్చి తమ ఆవేదన చెప్పుకుంటున్నారు. బీఆర్ఎస్ హయాంలో పోస్టులు అమ్ముకున్న విషయం కొన్ని చోట్ల రుజువైంది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనూ అదే జరిగే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. అందుకే ముందే కళ్లు తెరిచి అధికారులకు గట్టిగా హెచ్చరికలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ పరిధిలో ఉండే ఈ ఉద్యోగాలను కలెక్టర్లు మెరిట్ ఉన్న అభ్యర్థులకే దక్కేలా చేయాలని, డబ్బులు ఇచ్చి ఉద్యోగాలు తెచ్చుకునే ప్రయత్నం ఎవరు చేయవద్దని, తాము అధికారంలోకి వస్తే డబ్బులు తీసుకున్న, ఇచ్చిన వారిని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు. అడ్డదారిలో ఉద్యోగాలు తెచ్చుకునే ప్రయత్నం చేయకుండా మెరిట్ ఉన్న వాళ్లకు అవకాశం రానివ్వాలి. మెరిట్ తో ఉద్యోగాల కోసం ప్రయత్నం చేసే వారికి జాగృతి అండగా ఉంటుంది. ఈ విషయంపై ప్రభుత్వం వెంటనే ప్రత్యేక దృష్టి పెట్టి విచారణ చేయించాలని డిమాండ్ చేశారు.

# లోక్ సభ ఎన్నికల తర్వాత ఈటలలకు ప్రాధాన్యం తగ్గుతోందా?

**మొదటిపేజీ తరువాయి**



ఉమ్మడి కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ నుంచి 2004 - 2023 మధ్య నాలుగు సాధారణ ఎన్నికలు, మూడు ఉప ఎన్నికల్లో గెలిచి తన పట్టు నిలుపుకున్నారు ఈటల రాజేందర్. కేసీఆర్‌తో విభేదించడంతో పాటు రకరకాల కారణాల వల్ల బీఆర్ఎస్ నుంచి బయటికి వచ్చి బీజేపీ కండువా కప్పుకున్నారాయన. గత అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్‌తో పాటు గజ్వేల్‌లో అప్పటి సీఎం కేసీఆర్‌పై పోటీ చేసి రెండు చోట్ల ఓడిపోయారు ఈటల. అయితే.... తర్వాత వచ్చిన లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి నుంచి బరిలో దిగి గెలిచారు. అయితే... పార్లమెంట్ ఎన్నికల తర్వాతి నుంచి బీజేపీలో ఈటల ప్రాధాన్యత క్రమంగా తగ్గిపోతుందని, ఇంకా చెప్పాలంటే... ఉద్దేశ్యపూర్వకంగా తగ్గించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నట్టు అనుమానిస్తున్నారు ఆయన అనుచరులు. పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి దక్కకపోవడాన్నే అందుకు ఉదాహరణగా చెబుతున్నారు. అదే సమయంలో మల్కాజిగిరి ఎంపీ అయ్యాక హుజూరాబాద్‌కు టైం ఇవ్వడం బాగా తగ్గించేశారు రాజేందర్. అంతకు ముందు వారంలో ఐదు రోజులకు తగ్గకుండా నియోజకవర్గంలో ఉండే నాయకుడు తర్వాత చుట్టపుచూపుగా మారిపోయారన్నది లోకల్ కేడర్ మాట. అయితే ఆ లోటును పూరిస్తూ... ఇటీవల పంచాయతీ ఎన్నికల సమయంలో తరచుగా హుజూరాబాద్‌కు వచ్చి తన మనుషులను పలు చోట్ల సర్పంచ్‌లుగా గెలిపించుకున్నారు. కానీ... ప్రస్తుతం జరుతున్న మున్సిపల్ ఎన్నికలు జరుగుతున్న వేళ మళ్లీ ఇటువైపు రావడం మానేశారాయన.

ఈ నియోజకవర్గం పరిధిలో జమ్మికుంట, హుజూరాబాద్ రెండు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇక్కడ పట్టు సాధిస్తేనే ఎమ్మెల్యేగా విజయం దక్కుతుంది. అంత ప్రాధాన్యత ఉన్న పట్టణాల్లో జరుగుతున్న ఎన్నికల్ని ఈటెల ఎందుకు పట్టించుకోవడం లేదన్న అంశంపై ఆసక్తికర చర్చ సాగుతోంది. బీజేపీ అధిష్టానం ఆదేశాల మేరకే ఆయన హుజురాబాద్ వైపు రావడం లేదన్నది లోకల్ కేడర్ చెబుతున్న మాట. రాష్ట్రంలో పార్టీకి 8మంది ఎంపీలు ఉండగా.... ఒకరి నియోజకవర్గంలో మరొకరు జోక్యం చేసుకోవద్దని పార్టీ రాష్ట్ర శాఖ ఆదేశాలిచ్చిందట.అందుకే రావడంలేదని కొందరు అంటుంటే.... మరికొందరు మాత్రం.... మున్సిపల్ ఎన్నికల స్టార్ క్యాంపెయినర్స్ లిస్టులో ఈటల ఉన్నారు.ఆయన రాష్ట్రంలో ఎక్కడైనా తిరగవచ్చు. రావద్దని అంటే స్టార్ట్ క్యాంపెయినర్‌గా ఎందుకు ఎంపిక చేస్తారని అడుగుతోంది మరో వర్గం. కానీ అసలు విషయం వేరే వుందనే గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి. ముక్కోణపు పోటీ, లోకల్ బీజేపీ నేతల సహకారం లేకపోవడం, స్థానిక ఎంపీ బండి సంజయ్ అప్పర్ హ్యాండ్ సాధించడం లాంటి కారణాలతో ఇక్కడి మున్సిపల్ ఎన్నికలను పట్టించుకోక పోవడమే నయం అని తొలుత భావించారట ఆయన. కానీ...పక్క నియోజకవర్గాల్లో జోక్యం చేసుకోవద్దని పార్టీ నాయకత్వం సీరియస్‌గా చెప్పాక పునారాలోచనలో పడ్డట్టు తెలిసింది. అసలు ఆ రూల్ పెట్టిందే తన కోసమని, తనను హుజురాబాద్ రాకుండా చేసేందుకే నిబంధన పెట్టారని గట్టిగా భావించి మనసు మార్చుకున్నట్టు తెలిసింది. ఆ క్రమంలోనే... లోకల్‌గా ఉన్న తన గ్రూప్‌తో సంప్రదించి వాళ్ళ ప్రభావం ఉన్న చోట్ల పోటీలో ఉండమని చెప్పేశారట.

ఈ రెండు మున్సిపాలిటీల్లో బీజేపీ ప్రకటించిన కౌన్సిలర్ అభ్యర్థుల జాబితాలో తమకు తగినంత ప్రాధాన్యత దక్కలేదని ఆయన అనుచరులు ఈటల దృష్టికి తీసుకువెళ్ళారు. అదే సమయంలో ఆయన అనుచరులుగా పేరున్న కొందరు నేతలు ఫార్వార్డ్ బ్లాక్ తరపున, ఇండిపెండెట్లుగా బరిలో ఉండటం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. పైకి మాత్రం పార్టీ నిలబెట్టిన అభ్యర్థులకే తమ మద్దతు అని స్థానిక ఈటల టీం ముఖ్యులు అంటున్నా... లోపల వేరే జరుగుతోందనే అనుమానాలు బలపడుతున్నాయి. సర్పంచ్ ఎన్నికల ప్లాన్‌నే ఇప్పుడు కూడా అమలు చేయాలన్న నిర్ణయానికి ఎంపీ వచ్చినట్టు ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల్లో అక్కడక్కడ ఆయన ఫోటో లేకుండా ఫ్లెక్సీలు వెలుస్తుండటం దీనికి మరింత ఊతం ఇస్తోంది. అలాగే కేంద్రమంత్రి బండి సంజయ్ నిర్వహించిన సుడిగాలి ప్రచారానికి సైతం టచ్‌మీ నాట్ అన్నట్టే ఉన్నారట ఈటల అనుచరులు.పార్టీ ఆదేశం ప్రకారం నియోజకవర్గానికి రాకపోయినా..... తన మార్క్ చూపించాలని రాజేందర్ డిసైడైనట్టు తెలుస్తోంది. తాను ఎక్కడా ప్రత్యక్షంగా కనిపించకుండానే... తన వారికి కావాల్సిన అన్ని హంగులు సమకూర్చాలని భావిస్తున్నట్టు సమాచారం. అదే జరిగితే రెండు మున్సిపాలిటీల్లో పొలిటికల్‌గా కీలక మార్పులు జరిగే అవకాశాలున్నాయంటున్నారు విశ్లేషకులు. అటు రాష్ట్ర పార్టీలో అందివచ్చిన అవకాశం దక్కకుండా పోవడం, ఒంటరిని చేసే ప్రయత్నాలు ఊపందుకోవడం, ఇటు సొంత నియోజకవర్గంలో అడుగుపెడితే పార్టీతో ఇబ్బంది,వెళ్లకపోతే క్యాడర్‌తో కష్టం..

ఈ సమయంలో ఇంకా సంయమనం పాటించడం సరికాదనే భావనకు వచ్చిన ఈటల తాడో పేడో తేల్చుకోవడానికి సిద్ధమయ్యారని గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే ఈ తాడో పేడో అన్నది డైరెక్ట్‌గా పార్టీతోనా..? లేక తన అసెంబ్లీ నియోజకవర్గం హుజురాబాద్ వరకే పరిమితమా అన్నది క్లారిటీ రావాల్సి ఉందని అంటున్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని అత్యంత జాగ్రత్తగా పావులు కదుపుతున్న ఈటల వ్యూహం ఫలిస్తుందా...? ఆయన విసరబోతున్న ఈట ఏ లక్ష్యాన్ని చేరుతుందన్నది ఆసక్తికరంగా మారింది.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేసిన... ఎమ్మెల్యే జయసూర్య

**జూపాడు బంగ్లా ఫిబ్రవరి 7 ప్రజాస్వరం**



జూపాడు బంగ్లా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు 235,713 లక్షల రూపాయలు గల ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వచ్చిన చెక్కులను పంపిణీ చేసిన నందికొట్కూరు నియోజకవర్గ ఎమ్మెల్యే గిత్త జయసూర్య, మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం నందు ఎంపీడీవో గోపికృష్ణ, తాసిల్దార్ చంద్రశేఖర్ నాయక్, మండల నాయకుల ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు తుడిచెర్ల గ్రామానికి చెందిన (1)దండల హరి కృష్ణ,కు 25 వేల 24 రూపాయలు. జూపాడు బంగ్లా గ్రామానికి చెందిన (2)కాటేపోగు ఇందిరమ్మ,కు 32 వేల 28 రూపాయలు. తంగడంచ గ్రామానికి చెందిన (3)గువ్వల శ్రీనివాసులు, కు 13 వేల 301 రూపాయలు. (4) 80 బన్నూరు గ్రామానికి చెందిన అహల్య సిద్దిరెడ్డి,కి 42 వేల 919 రూపాయలు.(5) పారుమంచాల గ్రామానికి చెందిన పన్నగి ఈశ్వరమ్మ,కు 41 వేల 441 రూపాయలు. (6) మండ్లెం గ్రామానికి చెందిన ప్రభుదాస్,కు 81 వేల రూపాయలు. సీఎం ఆర్ ఎఫ్ ద్వారా మంజూరైన ఈ చెక్కులను జూపాడు బంగ్లా మండల నాయకులతో కలసి లబ్ధిదారులకు అందజేయడం జరిగినది. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ గుండ్రెడ్డి మోహన్ రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, క్లస్టర్ ఇంచార్జ్ గిరీశ్వర్ రెడ్డి, 80 బన్నురు సొసైటీ చైర్మన్ పిక్కిలి శ్రీనివాసులు, టిడిపి జిల్లా మహిళా అధ్యక్షురాలు ప్రసన్న లక్ష్మి, టిడిపి నాయకులు తుడిచర్ల వెంకట రాముడు, రవికుమార్ యాదవ్, లింగాపురం వేణుగోపాల్ రెడ్డి, పారుమంచాల దేవ సహాయం, టిడిపి నాయకులు కార్యకర్తలు, ప్రభుత్వ అధికారులు పాల్గొనడం జరిగినది

# చేతకాకపోతే రాజీనామా చేయ్

**మొదటిపేజీ తరువాయి**

ప్రకటన చేయాలని సవాల్ విసిరారు. శనివారం హైదరాబాద్ లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. మున్సిపల్ ఎన్నికల్లో ఓట్ల కోసం సీఎం రేవంత్ రెడ్డి దిగజారి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయంలో జరిగిన కుంభకోణాలు, అక్రమాలకు కారకుడైన కేసీఆర్‌పై చర్యలు తీసుకోకుండా ఎవరు అడ్డుకుంటున్నారో రేవంత్ రెడ్డి చెప్పాలని డిమాండ్ చేశారు. . కాళేశ్వరం అవినీతి విషయంలో నన్ను ప్రశ్నించే నైతిక హక్కు రేవంత్ రెడ్డికి లేదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. కేసీఆర్‌ను జైలుకు పంపిస్తానని ఎన్నికల ముందు చెప్పిన మాటలు ఏమయ్యాయని నిలదీశారు. అధికారంలోకి వచ్చాక కేసీఆర్‌పై ఈగ, దోమ వాలకుండా కాపాడుతున్నారని ఆరోపించారు. నిజంగా చిత్తశుద్ధి ఉంటే చర్యలు ఎందుకు తీసుకోవడం లేదు? ఎవరు అడ్డుకుంటున్నారో సమాదానం చెప్పాలన్నారు. కేసీఆర్‌ను రాహుల్ గాంధీ అడ్డుకుంటున్నాడా? కాంగ్రెస్ అధిష్టానం అడ్డుకుంటున్నదా? దీనిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డే కేసీఆర్‌ను కాపాడుతున్నారని కుండబద్దలు కొట్టారు.

**బీజేపీ, మోడి సత్తా చూపిస్తాం**

బీఆర్ఎస్‌కాంగ్రెస్ మధ్య డూప్ డైలాగులు నడుస్తున్నాయని కిషన్ రెడ్డి సెటైర్లు వేశారు. ప్రధానమంత్రి మోదీని రాజకీయంగా ఎదుర్కోలేకే ఆయా పార్టీలు ఈ డ్రామాలు చేస్తున్నారని ఆరోపించారు. తెలంగాణలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత బీఆర్ఎస్, కాంగ్రెస్ అవినీతిపై తప్పకుండా చర్యలు తీసుకుంటామన్న కిషన్ రెడ్డి... అప్పుడు బిజెపి సత్తా ఏంటో, మోడి సత్తా ఏంటో చూపిస్తామని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి...తన వైఫల్యాలకు బాధ్యత తీసుకోకుండా, మా భుజాలపై బందూకు పెట్టి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో కేసీఆర్ కూడా తన అసమర్థతను కేంద్ర ప్రభుత్వంపై రుద్దే ప్రయత్నం చేశారన్నారు. తెలంగాణ ప్రజలు చైతన్యవంతులనీ మాటలతో మభ్యపెట్టి కాలం గడిపేయాలనుకుంటే, రేవంత్ రెడ్డిని ఎవ్వరూ రక్షించలేరని చెప్పారు. ముఖ్యమంత్రి పదవికి ఒక గౌరవం, విలువ ఉంటుందన్న కిషన్‌రెడ్డి.. రేవంత్ రెడ్డి ఆ విలువలు ఏ మాత్రం పాటించకుండా, గాలి మాటలతో, బాధ్యతలేని వ్యాఖ్యలతో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

**నాడు కేసీఆర్...**

**నేడు రేవంత్ ఎంఐఎంకు జీ హుజూర్..**

కాంగ్రెస్ పార్టీలో బుజ్జగింపు రాజకీయాలు పరాకాష్టకు చేరుకున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ముస్లింల ఓట్ల కోసం "కాంగ్రెస్ అంటే ముస్లింలు, ముస్లింలు అంటే కాంగ్రెస్" అని సీఎం స్థాయిలో ఉన్న రేవంత్ రెడ్డి మాట్లాడిన దిగజారుడు వ్యాఖ్యలను ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. కాంగ్రెస్ అయినా, బీఆర్ఎస్ అయినా... అధికారంలో ఉన్న పార్టీ మజ్లిస్ కనుసైగల్లో పాలన చేయడం తెలంగాణ ప్రజల దురదృష్టమన్నారు. గతంలో సీఎంగా ఉన్న సమయంలో కేసీఆర్ అసదుద్దీన్ ఓవైసీ బుల్లెట్‌పై అతని ఇంటికి వెళ్లాడన్నారు. అప్పుడు బుల్లెట్ నడిపింది ఓవైసీ.. కూర్చున్నది కేసీఆర్ అన్నారు. నేడు సీట్లు మారాయి గానీ డ్రైవర్ మారలేదని సెటైర్లు వేశారు. ఇప్పుడు బుల్లెట్ నడిపేది ఓవైసీయే కానీ అందులో కూర్చున్నది రేవంత్ రెడ్డి అన్నారు. అప్పుడు కేసీఆర్, ఇప్పుడు రేవంత్ ఇద్దరికీ స్వతంత్ర నిర్ణయాలు తీసుకునే సత్తా వాళ్లకు లేదన్నారు. బీఆర్ఎస్‌కాంగ్రెస్ పార్టీలు ఎంఐఎం పార్టీకి బానిసలుగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. ఎన్నికల ప్రచారంలో అభివృద్ధి గురించి మాట్లాడాల్సిన సీఎం... మతపరమైన రిజర్వేషన్ల గురించి మాట్లాడటం దురదృష్టకరమని కిషన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి ఎన్నికలకు ముందు మజ్లిస్ పార్టీని ప్రసన్నం చేసుకోవడం, మజ్లిస్ ఓట్లు పొందడం కోసం ఎత్తుగడలు వేయడం కాంగ్రెస్ పార్టీకి అలవాటుగా మారిందని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిన 4 శాతం ముస్లిం రిజర్వేషన్లను హైకోర్టు రెండుసార్లు కొట్టివేసిందన్నారు. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని తీర్పు ఇచ్చిందని తెలిపారు. అయినా సుప్రీంకోర్టు స్టేను అడ్డుపెట్టుకుని చట్టబద్ధత లేని 4 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తున్నారని మండిపడ్డారు. మతపరమైన సమావేశం నిర్వహించిన సీఎం.. ముస్లింలకు శాశ్వతంగా 4 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రకటించడం కచ్చితంగా ఓటుబ్యాంకు రాజకీయాలేనన్నారు.



**ఆ అగ్నిప్రమాదంపై అనుమానాలు ఉన్నాయి**

శనివారం నాంపల్లిలోని రెడ్ హిల్స్‌లో ఉన్న ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో జరిగిన అగ్నిప్రమాదంపై కిషన్ రెడ్డి అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన ఈ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై ఇప్పటివరకు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఆ ల్యాబ్‌లోని కంప్యూటర్లలో వందలాది కేసులకు సంబంధించిన కీలక డేటా, టెక్నికల్ ఎవిడెన్స్, ఫోరెన్సిక్ ఎవిడెన్స్ నిల్వ ఉన్నాయని సమాచారం అందిందన్నారు. ఈ అంశం తీవ్రమైందన్నారు. ఓటుకు నోటు కేసు, ఫోన్ ట్యాపింగ్ కేసు వంటి హైప్రొఫైల్ కేసులకు సంబంధించిన డిజిటల్ ఎవిడెన్స్ అక్కడ ఉందా? లేదా? అన్నది ప్రభుత్వం వెంటనే ప్రజలకు చెప్పాలన్నారు. అందులో టెక్నికల్ ఎవిడెన్సీ, ఫోరెన్సిక్ ఎవిడెన్సీ ఉందా లేదా అనేది స్పష్టంగా ప్రకటించాలన్నారు.ఉంటే బ్యాకప్ ఉందా లేదనేది ప్రకటించాలన్నారు. ఇలాంటి హై లెవల్ కేసులకు సంబంధించిన ఆధారాలు ఒకే చోట ఉండి, అదే చోట అగ్నిప్రమాదం జరగడంపై అనేక ప్రశ్నలు ప్రజల్లో ఉత్పన్నమవుతున్నాయని చెప్పారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అధికారికంగా, బాధ్యతతో స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు.

# ఫోరెన్సిక్ ల్యాబ్ లో భారీ అగ్ని ప్రమాదం

# బూడిదైన ఎవిడెన్స్

**మొదటిపేజీ తరువాయి**

మొదలుకుని.. నేటి ఫోన్ ట్యాపింగ్ కేసు వరకు కీలక ఫైళ్లన్నీ ఇక్కడే దాచి పెట్టారు. నాంపల్లిలో గల ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో శనివారం ఉదయం భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ల్యాబ్ బిల్డింగ్ మొదటి అంతస్తులో మంటలు చెలరేగడంతో చుట్టుపక్కల ప్రాంతంలో తీవ్ర కలకలం చోటు చేసుకుంది. మంటల ఒక్కసారిగా వ్యాపించడంతో భవనం మొత్తం దట్టమైన పొగలు అలుముకోవడంతో సహాయక చర్యలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఫోరెన్సిక్ ల్యాబ్ లోని మరీ కీలకమైన ఎవిడెన్స్ దాచి పెట్టిన గది మొత్తం కాలి బూడిదైంది. దాదాపు 50 కంప్యూటర్లు బూడిదలో కలిసిపోయాయి. ఇప్పటి వరకు సేకరించిన ఎవిడెన్స్ మొత్తం అగ్నికి ఆహుతి అయ్యాయి. అయితే, తెలంగాణ స్టేట్ ఫోరెన్సిక్ ల్యాబ్ కావడం వల్ల అధికారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ల్యాబ్‌లో డీఎన్ఏ పరీక్షలు, ఫింగర్‌ప్రింట్ విశ్లేషణతో పాటు రాష్ట్రవ్యాప్తంగా పలు కీలక కేసుల్లో ఆధారాల ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్ లోనే ఉన్నాయి. ఎఫ్ఎస్ఎల్ కంటే కార్యాలయంలోనే ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన ఆధారాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఫస్ట్ ఫ్లోర్ లో కంప్యూటర్ ల్యాబ్ తో పాటు కీలకమైన గదులు ఉండటంతో.. పలు కేసుల్లో సేకరించిన పేపర్ వర్క్ ఎవిడెన్స్ సైతం ఫస్ట్ ఫ్లోర్ లోనే ఉంది. మంటలు అదుపులోకి వచ్చినా శనివారం రాత్రి వరకు ఏమేం ఎవిడెన్స్ కాలిపోయాయి.. ఎంత వరకు నష్టం వాటిల్లింది అనే వివరాలు ప్రకటించలేదు.

కాగా, పది రోజుల క్రితం నాంపల్లి బచాస్ ఫర్నీచర్ దుకాణంలో భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ప్రమాదంలో మొత్తం ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. ఫర్నీచర్ దుకాణంలోని సెల్లార్‌లో షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగింది. అయితే అప్పటికే సెల్లార్‌లో వాచ్‌మెన్ ఇద్దరు పిల్లలు, మరో మహిళ ఉండిపోయారు. వారు బయటకు వచ్చేందుకు దారి లేకపోవటంతో వారిని రక్షించేందుకు అక్కడే పని చేసే మరో ఇద్దరు యువకులు వెళ్లారు. ఆ ముగ్గుర్ని రక్షించే క్రమంలో దట్టమైన పొగ కమ్ముకొని వారికి దారి కనిపించలేదు. అక్కడ ఫర్నీచర్ తయారీకి వాడే ఫోమ్, ఇతర సామాగ్రి ఉండటంతో మంటల తీవ్రత పెరిగింది. దీంతో ఎటూ వెళ్లలేని పరిస్థితుల్లో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. దాదాపు 18 గంటల రెస్క్యూ ఆపరేషన్ తర్వాత వారి మృతదేహాలను బయటకు తీసుకొచ్చారు.

ఫోరెన్సిక్ ల్యాబ్ లో భారీ అగ్నిప్రమాదం రాష్ట్ర వ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఈ ప్రమాదంలో కీలకమైన కేసులకు సంబంధించిన ఆధారాలు, డిజిటల్ సాక్ష్యాలు అగ్నికి ఆహుతయినట్లుగా తెలుస్తోంది. సుమారు రెండు గంటల పాటు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చినప్పటికీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఉదయం వేళ కార్యాలయం పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో, అకస్మాత్తుగా కంప్యూటర్ ల్యాబ్ విభాగం నుంచి మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు ఇతర విభాగాలకు వ్యాపించాయి. దట్టమైన పొగలు భవనం మొత్తాన్ని కమ్మేశాయి. ఈ ప్రమాద సమయంలో లోపల ఉన్న ఒక వ్యక్తికి గాయాలు కాగా, వెంటనే అప్రమత్తమైన సహచరులు బాధితుడిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. ప్రమాద వార్త తెలియగానే డీసీపీ శిల్పవల్లి సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అగ్నిమాపక యంత్రాలు మంటలను ఆర్పే ప్రక్రియను ఆమె స్వయంగా పర్యవేక్షించారు. ఫోరెన్సిక్ ల్యాబ్ వంటి అత్యంత కట్టుదిట్టమైన భద్రత ఉండే చోట అగ్నిప్రమాదం జరగడంపై ఆమె అధికారులను ఆరా తీశారు. అసలు మంటలు ఎలా మొదలయ్యాయి? షార్ట్ సర్క్యూట్ కారణమా లేక మరేదైనా కారణం ఉందా? అనే కోణంలో ప్రాథమిక విచారణ చేపట్టారు.

**ఓటుకు నోటు కేసు నుంచి సిట్ దాకా..**

ఈ ప్రమాదంలో అత్యంత ఆందోళన కలిగించే అంశాలు బయటకు వస్తున్నాయి. కంప్యూటర్ ల్యాబ్‌లో ఉన్న అనేక కీలకమైన కేసుల డేటా, భౌతిక పత్రాలు కాలి బూడిదయ్యాయి. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన పలు నేరాలకు సంబంధించిన డిజిటల్ సాక్ష్యాలు, ఫోరెన్సిక్ విశ్లేషణలు ఈ ల్యాబ్‌లోనే ఉన్నాయి. సాక్ష్యాలు బుగ్గిపాలు కావడంతో ఆయా కేసుల విచారణపై ఈ ప్రభావం పడే అవకాశం ఉందని న్యాయ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డి కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నఓటుకు నోటు కేసుకు సంబంధించిన ఫైళ్లు ఇక్కడే ఉన్నాయి. ఈ కేసులో ఎమ్మెల్యే సెబాస్టియన్‌ను ప్రలోభాలకు గురి చేసినట్లు కేసు నమోదైంది. దీంతో పాటుగా బీఆర్ఎస్ హయాంలో బీజేపీ ఎమ్మెల్యేల కొనుగోలు కేసుకు సంబంధించిన ఫైళ్లు కూడా ఇక్కడే ఉన్నాయి. ఫైలట్ రోహిత్ రెడ్డి ఫాంహౌస్ లో ఈ చర్చలు జరిగినట్లు కేసు నమోదైంది. దీనికి సంబంధించిన కేసులో కొన్ని ఎవిడెన్స్ దొరికాయని అప్పుడు విచారణ బృందం భావించింది. అదే విధంగా బీఆర్ఎస్ హయాంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించిన ఫైళ్లు కూడా ఇక్కడే ఉన్నాయి. ఈ కేసులో మాజీ సీఎం కేసీఆర్ సహా మాజీ మంత్రులు హరీశ్ రావు, కేటీఆర్‌ను విచారించారు. అంతకు ముందు పలువురు పోలీసు అధికారులను సైతం విచారించి కీలక డాక్యుమెంట్లు, హార్డ్ డిస్క్ లను స్వాధీనం చేసుకున్నారు. వీటన్నింటినీ ఇక్కడే భద్ర పరిచారు. కానీ, ఇప్పుడు అవన్నీ కాలి బూడిదయ్యాయి.

**కుట్ర కోణం ఉందా?**

సాధారణంగా ఫోరెన్సిక్ కార్యాలయాల్లో ఫైర్ సేఫ్టీ వ్యవస్థలు పకడ్బందీగా ఉంటాయి. అలాంటిది కంప్యూటర్ ల్యాబ్‌లోనే మంటలు రావడం, కీలక పత్రాలు ఉన్న చోటే ప్రమాదం తీవ్రత ఎక్కువగా ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఎవరైనా కావాలనే సాక్ష్యాలను రూపుమాపడానికి ఈ పని చేశారా? అనే కుట్ర కోణం పై పోలీసులు దృష్టి సారించారు. ల్యాబ్‌లోని సీసీటీవీ విజువల్స్‌ను పోలీసులు స్వాధీనం చేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. క్లూస్ టీమ్ , ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరేట్ అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కంప్యూటర్లలోని హార్డ్ డిస్క్‌లు ఎంతవరకు దెబ్బతిన్నాయి, వాటి నుంచి డేటాను రికవరీ చేసే అవకాశం ఉందా అనే దానిపై ఐటీ నిపుణుల సలహాలు తీసుకుంటున్నారు. ఈ ఘటనపై ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఫోరెన్సిక్ నివేదికలు తారుమారైతే నేరస్తులకు మేలు జరుగుతుందనే కోణంలో పోలీసులు అత్యంత జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు.

కాగా, ఈ అగ్నిప్రమాదానికి సంబంధించి హైదరాబాద్ పోలీస్ సెంట్రల్ జోన్ డీసీపీ కె. శిల్పవల్లి మీడియాకు వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం మంటలు అదుపులోకి వచ్చాయని ఆమె తెలిపారు. శనివారం ఉదయం 10:00 గంటలకు అగ్ని ప్రమాదంపై సమాచారం అందిందని డీసీపీ శిల్పవల్లి వివరించారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం జరిగిందని చెప్పుకొచ్చారు. నేర పరిశోధనకు సంబంధించిన ఫైల్స్, ఎవిడెన్స్‌కు సంబంధించి ఈ ల్యాబ్ నుంచే ఆపరేషన్ జరుగుతుందని తెలిపారు. మంటల్లో కీలక ఫైల్స్ కాలిపోయిన విషయంపై ఇంకా స్పష్టత లేదన్నారు. మొదటి అంతస్తులో కంప్యూటర్స్ ఉంటాయని ఆమె వెల్లడించారు. 5 ఫైర్ ఇంజిన్‌ల సాయంతో మంటలను పూర్తిగా అదుపు చేశామని డీసీపీ తెలిపారు. ఈ కార్యాలయంలో పనిచేస్తున్న ఆఫీస్ బాయ్ మంటలను గమనించి సమాచారం అందించారని వివరించారు. ఆఫీస్ బాయ్ గమనించి వెంటనే మంటలార్పే ప్రయత్నం చేశారని అన్నారు. ఈ క్రమంలో అతను అస్వస్థతకు లోనయ్యారని.. వెంటనే 108లో ఆస్పత్రికి తరలించామని డీసీపీ తెలిపారు. ఈ ప్రమాదం జరిగినప్పుడు నలుగురు ఉద్యోగులు లోపలే ఉన్నారన్నారు. మంటలు గమనించి వారు సురక్షితంగా బయటపడ్డారని ఆమె చెప్పారు.




**అనుమానాలు వ్యక్తం చేసిన కేటీఆర్**

నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో జరిగిన అగ్నిప్రమాదంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అనుమానాలు వ్యక్తం చేశారు. ఓటుకు నోటు కేసుకు సంబంధించిన వాయిస్ రికార్డింగ్‌లను, ఫోన్ ట్యాపింగ్ కేసులో కాంగ్రెస్ ప్రభుత్వం పుట్టించిన తప్పుడు ఆధారాలను కప్పిపుచ్చడానికి చేసిన ప్రయత్నంగా కనిపిస్తుందని సందేహం వ్యక్తంచేశారు. ఓటుకు నోటు కేసుకు సంబంధించిన వాయిస్ రికార్డింగ్‌లను, ఫోన్ ట్యాపింగ్ కేసులో కాంగ్రెస్ ప్రభుత్వం పుట్టించిన తప్పుడు ఆధారాలను కప్పిపుచ్చడానికి చేసిన ప్రయత్నంగా కనిపిస్తుందని సందేహం వ్యక్తంచేశారు. ఈ మేరకు ట్విట్టర్ (ఎక్స్) వేదికగా కేటీఆర్ స్పందించారు. కాగా, బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ కూడా ట్విట్టర్ వేదికగా స్పందించారు. మొత్తం ల్యాబ్ కాలిపోతుంది.. ఏ ఆధారాలు నాశనం చేశావు అని సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు.

**విలువైన హార్డ్ డిస్కులు అగ్నికి ఆహుతి: డీఎఫ్ఓ శ్రీ దాస్**

తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో మంటలు అదుపులోకి వచ్చాయని డీఎఫ్ఓ శ్రీ దాస్ తెలిపారు. మొదటి అంతస్తులోని వివిధ కేసులకు సంబంధించిన సీజ్డ్ ప్రాపర్టీ విభాగంలో అగ్నిప్రమాదం సంభవించిందన్నారు. చాలా విలువైన హార్డ్ డిస్కులు, డాక్యుమెంట్స్ అగ్నికి ఆహుతయ్యాయని వివరించారు. ఇవాళ ఉదయం 10:22 గంటలకు అగ్నిప్రమాదం గురించి సమాచారం అందిందని ఆయన అన్నారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్నామని.. అప్పటికే మంటలు ఎగిసి పడుతున్నాయని తెలిపారు. కెమికల్ ల్యాబ్ మెటీరియల్ మొత్తం రెండో అంతస్తులో ఉందని చెప్పుకొచ్చారు. అయితే రెండో అంతస్తుకు మంటలు వ్యాపించలేదన్నారు. మొదటి అంతస్తులో సెన్సిటివ్‌గా ఉన్న ప్లాస్టిక్ వస్తువుల కాలిపోయాయని వివరించారు.హార్డ్ డిస్కులు పూర్తిగా కాలిపోయాయా? పాక్షికంగా కాలాయా? అన్నది పరిశీలించాలని డీఎఫ్ఓ తెలిపారు.

# చాయ్ పెడుతూ ఓట్ల అభ్యర్థన...

- **బీజేపీ అభ్యర్థి ఇంటింటి ప్రచారం....**

**మెదక్ ఫిబ్రవరి 07 (ప్రజా స్వరం)**


మెదక్ మున్సిపల్ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా 31 వ వార్డ్ బిజెపి అభ్యర్థి సుంకోజు రాజు తో వార్డు ఇన్చార్జి జనగామ మల్లారెడ్డి కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడే చాయ్ దుకాణంలో చాయ్ పెడుతున్న మహిళా ను ఓటు అభ్యర్థిస్తూ అక్కడే ఉన్న వారికి చాయ్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ పార్టీ తోనే ప్రజల సంక్షేమం, పట్టణ అభివృద్ధి సాధ్యమని అన్నారు. నూతన హైవే లు, డివైడర్స్, సెంట్రల్ లైట్స్ తో పట్టణంలో నూతన కళ ఏర్పడిందని అన్నారు. దేశ ప్రజల సంరక్షనే లక్ష్యంగా నరేంద్ర మోదీ పాలన సాగిస్తున్నారని అన్నారు. భవిష్యత్తు తరాల కోసం బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళ మోర్చ నాయకులు మల్లికా, పట్టణ మహిళ మోర్చ అధ్యక్షురాలు కాస ప్రవళిక, బీజేపీ నాయకులు శ్రీనివాస చారి, రాజ్, సురేష్, భరత్ తదితరులు పాల్గొన్నారు.



# వార్డులో అభ్యర్థి సతీమణి, కుమారుడి విస్తృత ప్రచారం....

**మెదక్ ఫిబ్రవరి 07 (ప్రజా స్వరం)**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని 29 వ వార్డు కాంగ్రెస్ అభ్యర్థి బొద్దుల క్రిష్ణ సతీమణి రుక్మిణి, కుమారుడు తో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహిస్తూ ఓట్లును అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డు ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం ప్రజా సేవలో ఉండేందుకే మీ ముందుకు రావడం జరిగిందని అన్నారు. ప్రజల మద్దతు కాంగ్రెస్ పార్టీ కి ఉందని ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ చేస్తున్న అభివృద్ధి చూసి ప్రతి ఇంట్లో ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని అన్నారు. పట్టణం వార్డు అభివృద్ధి జరగాలంటే అధికార కాంగ్రెస్ పార్టీ ఓట్లు వేయాలని కోరారు.



# గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

**మేడ్చల్,ప్రజాస్వరం:**

గుర్తుతెలియని మృతదేహం కలకలం సృష్టించిన ఘటన మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ యతీష్ చంద్ర వివరాల ప్రకారం.. మేడ్చల్ PS పరిధిలోని చెక్ పోస్ట్ వద్ద సుమారు 35 సంవత్సరాల గల గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్థానికుల సమాచారం ద్వారా గుర్తించబడినట్లు తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించగా వ్యక్తి చాతి పైనుండి గుర్తు తెలియని వాహనం వెళ్లడంతో మృతి చెందినట్లు నిర్ధారించమని చెప్పారు. మృతుడి



వివరాలు ఎవరికైనా తెలిస్తే మేడ్చల్ పోలీసుల కు సమాచారం ఇవ్వాలని అన్నారు..

# తూప్రాన్ 7వ వార్డు అల్లాపూర్ లో బీ ఆర్ ఎస్ ప్రచారం జోరు

**మనోహరాబాద్ ప్రజాస్వరం**

మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ ఏడో వాడు కౌన్సిలర్ గా టిఆర్ఎస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న టిఆర్ఎస్ అభ్యర్థి మన్నె నాగరాజు గెలుపు కోసం అల్లాపూర్ గ్రామంలో ఇంటింటా ప్రచారం జోరందుకుంది. ప్రతి ఓటర్ను కలుస్తూ మన్నే నాగరాజు కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. నాగరాజుకు ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించే బాధ్యత మాది అంటూ ప్రజలు మద్దతు పలికారు. ఈ కార్యక్రమంలో మనోహర మండల భీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షులు పురం మహేష్ముదిరాజ్, ముప్పిరెడ్డిపల్లి మాజీ ఉప సర్పంచ్ వార్డు సభ్యులు సాదు సత్యనారాయణ, టిఆర్ఎస్ నాయకులు పెద్దింటి చిన్న యాదగిరి, కొత్తూరు సాయికుమార్, ఈసురు గోవర్ధన్, మన్నే సత్యనారాయణ, దుర్గం కిషన్, మర్రి స్వామి. కృష్ణారెడ్డి, వడ్ల మచ్చందర్, అశోక్ వౌడ్. వడ్ల ఆచారి., పి.స్వామి. వెంకటేష్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.





# ఓటరా ప్రశ్నించు పట్టణ ప్రగతిని సాధించు.

- **ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు**

**కరీంనగర్/హైదరాబాద్ (ప్రజాస్వరం)**

ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు .పౌరుల చైతన్యం మీదనే పట్టణ ప్రగతి ఆధారపడి ఉంటుంది. ప్రశ్నించడం అనేది తిరుగుబాటు కాదు .అది బాధ్యతాయుతమైన పౌరుని లక్షణం. ప్రశ్న అభివృద్ధికి మూలం. సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం అధికారులతో ప్రజాప్రతినిధులతో ప్రశ్నించినప్పుడే అభివృద్ధికి బీజం పడుతుంది. ప్రజల అవసరాలకు అనుకూలంగా పాలన సాగాలంటే ప్రశ్న శక్తివంతమైన ఆయుధం ప్రశ్నించే గొంతుక ఉన్నచోట ప్రగతి పరుగులు తీస్తుంది . పట్టణాభివృద్ధి కేవలం ప్రభుత్వాల బాధ్యత మాత్రమే కాదు పౌరుల సమిష్టి కృషి జరిగినప్పుడే ఆశించిన సుందర ఆరోగ్యకరమైన నగరాలు నిర్మించుకోగలం.

**సమస్యను ప్రశ్నించు_ పరిష్కారాన్ని సాధించు.**

ప్రశ్నలేని చోట ప్రగతి స్తంభిస్తుంది. అభివృద్ధి మందగిస్తుంది.ప్రశ్న ఉన్న చోట ప్రగతి చిగురుస్తుంది. వార్డు /డివిజన్/ కౌన్సిలర్/ కార్పొరేటర్ గా పోటీచేసే అభ్యర్థును ఓటర్లు అడిగే ప్రశ్నలే పట్టణ ప్రగతికి దిక్సూచి.

**ఓటు మన ఆయుధం_ అభివృద్ధి మన లక్ష్యం.**

పౌర సేవలు ప్రజల ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలంటే పాలనలో పారదర్శకత పెరగాలి .ప్రశ్నించడం ద్వారా ప్రజాప్రతి నిధుల్లో పాలనలో జవాబుదారీతనం పెరుగుతుంది.పట్టణ ప్రగతి సాధ్యమవుతుంది.

**ప్రశ్నించే గొంతుకలే పట్టణాభివృద్ధికి కంచుకోటలు.**

పుర పాలకఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను బాధ్యతాయుతమైన ఓటర్లు ప్రశ్నించండి? ఓట్ల కొరకు వచ్చే అభ్యర్థులను రాబోయే ఐదేళ్ల కాలంలో వార్డు/ డివిజన్/ పట్టణ అభివృద్ధికి ఏ విధమైన కార్యాచరణ ప్రణాళికలు అమలు చేస్తారో ప్రశ్నలతో నిలదీయండి. ప్రశ్నించే గొంతుకలే పట్టణాభివృద్ధికి కంచుకోటలు. ఓటర్లు అడిగే ప్రశ్నలే ప్రజాప్రతినిధులకు విధానాల రూపకల్పనకు దిక్సూచిగా పనిచేస్తాయి.పట్టణ ప్రగతికి మార్గదర్శకమవుతాయి .

పుర పాలక ఎన్నికల్లో వార్డు/ డివిజన్ /కౌన్సిలర్ /కార్పొరేటర్ గా పోటీచేసే అభ్యర్థులు ఓటర్ల వద్దకు వచ్చినపుడు అభ్యర్థిని నిలదీయండి ?ప్రశ్నించండి ? మీ ప్రశ్నలు భవిష్యత్తు వార్డు డివిజన్ పట్టణ అభివృద్ధికి దశ దిశగా నిలుస్తాయి.

**మౌలిక సదుపాయాల కల్పన**

మౌలిక సదుపాయాల కల్పన వానాకాలంలో వార్డులో దెబ్బతిన్న రోడ్ల మరమ్మతులు .కొత్త రోడ్ల నిర్మాణం కోసం అభ్యర్థి దగ్గర ఉన్న ప్రణాళిక ఏమిటి ?వానాకాలంలో రోడ్లపై నీరు నిలవకుండా డ్రైనేజీ వ్యవస్థను ఏ విధంగా ఆధునీకరిస్తారు. వీధి దీపాలు _వెలుగు వార్డ్/ డివిజన్/ పట్టణ పరిధిలో ఎల్ ఈ డి దీపాల ఏర్పాటుచేసి నిరంతరం వెలిగేలా చేసేందుకు ఏ విధమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తారు ? ఆరోగ్యం మరియు పరిశుభ్రత చెత్త సేకరణ ప్రతిరోజు క్రమబద్ధంగా జరిగేలా ఎలాంటి చర్యలు చేపడతారు. పట్టణంలో దోమల నివారణ . పొంగి పొరిలే మురికి కాలువల నిర్వహణ 'కాలవల్లో పేరుకుపోయిన పూడిక తీత' తాగునీటి సమస్యలు' గుంతల మయమైన రహదారులు నిర్వహణ లేని పార్కులు వైద్య సేవలు భూగర్భ డ్రైనేజ్ 'నాలాల ఆక్రమణ అడ్డుకోవడం. ప్రభుత్వ భూముల రక్షణకు ఎలాంటి చర్యలు చేపడతారు. పట్టణాభివృద్ధి పథకాలు _ చట్టాలపై అవగాహన స్మార్ట్ సిటీ అమృత్ స్వచ్ఛభారత్ ఆవాస్ యోజన నిర్భయ ఫండ్ లాంటి పథకాలపై అవగాహన ఉందా? వీటికి నిధులు ఏ విధంగా రాబట్టగలుగుతారు. స్థానిక స్వపరిపాలన సాధికారిత సాధనకు మున్సిపల్ చట్టాలపై అవగాహన ఉందా?

**ప్రజారోగ్యం**

ప్రభుత్వ ఆసుపత్రుల్లో సౌకర్యాలు మెరుగుపరచడం మరియు ఉచితంగా మందులు లభించడానికి తీసుకునే చర్యలు ఏమిటి? ప్రజాపంపిణీ పథకం ప్రభుత్వ రేషన్ దుకాణాల్లో జరిగే అవకతవకలు అరికట్టి పేదలకు ఆహార వస్తువులను బియ్యం గోధుమలు చెక్కర వినియోగ వస్తువులుసకాలంలో అందించే ఏర్పాటు కొరకు కార్యాచరణ ఉందా? ఆహారభద్రత హక్కు రక్షణకు ఎలాంటి చర్యలు చేపడతారు.

**పబ్లిక్ ఆస్తుల రక్షణకు చర్యలు**

పట్టణంలో ప్రభుత్వభూములు ఎండోమెంట్ భూములు అక్రమ కబ్జాల నివారణకు మీ వద్ద ఉన్న షెడ్యూల్ ఏమిటి? ప్రజారోగ్యం వైద్యం ఆరోగ్య సేవలను అందరికీ అందుబాటులోకి తేవడం. భస్తీ దవాఖానాలల్లో ఆరోగ్య సేవలు ఉచిత మందుల లభ్యత జన ఔషధీ మందులను అందుబాటులో ఉంచడం . సీజనల్ వ్యాధుల నివారణ .దోమలు పందులు కోతులు కుక్కల బెడద నియంత్రణకు అభ్యర్థుల వద్ద ప్రత్యేక ప్రణాళిక ఉందా? ప్రశ్నించండి?

**పిర్యాదులకు ప్రత్యేక బాక్స్**

ప్రజల నుండి ఫిర్యాదుల ఫీడ్ బ్యాక్ కొరకు వాట్సాప్ నెంబర్ఈ అందరికీ అందుబాటులో ఉండే విధంగా చర్యలు సూచించండి.

**మంచినీటి సరఫరా**

తాగునీరు పర్యావరణం .ప్రతి ఇంటికి సరిపడా సురక్షితమైన మంచి నీరు సరఫరా చేయడానికి ప్రతి ఇంట ఇంకుడు గుంతల ఏర్పాటుకు అవలంబించే ప్రణాళిక ఏమిటి? వాడలో ఉన్న పార్కులు ఖాళీ స్థలాలను ఆక్రమణ నుండి కాపాడడం చెట్లను పెంచడం పచ్చదనం పరిశుభ్రతకొరకు అమలు చేసే ప్రణాళిక ఏమిటి?

**రిక్రియేషన్ సౌకర్యాలు_ ప్రణాళిక**

సీనియర్ సిటిజన్స్ యువతకు అనుకూలంగా వార్డ్ డివిజన్ పట్టణ స్థాయిలో వాకింగ్ ట్రాక్స్ ఓపెన్ జిమ్ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం రిక్రియేషన్ సౌకర్యాల ఏర్పాటు కొరకు ప్రణాళికలు ఉన్నాయా ప్రశ్నించండి.

**పర్యావరణ కాలుష్య నివారణకు చర్యలు**

చెరువుల కాలుష్యాన్ని అరికట్టడానికి మీరు తీసుకునే చర్యలు ఏమిటి? చెరువుల సంరక్షణపై ఎలాంటి ప్రణాళిక చేపడతారు. వాహనాల పార్కింగ్ స్థలాల ఏర్పాటు కు తీసుకునే చర్యలు? పురపాలనలో _ పారదర్శనికత పుర పాలనలో పారదర్శకత మరియుజవాబుదారీ తనం మున్సిపాలిటీకి ఆర్థిక సంఘం కేంద్ర 'రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే నిధులు ఖర్చు వివరాలను ప్రజలకు తెలియచేయడానికి వార్డు /డివిజన్ స్థాయి ఓటర్ల / ప్రజల పట్టణ సభలు ( గ్రామసభల మాదిరి) నిర్వహిస్తారా ?

**ప్రజలకు అందుబాటులో ఉంటారా?**

ఎన్నికైన వార్డు/ డివిజన్/ కౌన్సిలర్ /కార్పొరేటర్ ఓటర్లకు /ప్రజలకు తమ సమస్యలు చెప్పుకోవడానికి కార్యాలయంలో అందుబాటులో ఉండే సమయం నోటీస్ బోర్డ్ పై ప్రకటిస్తారా? .గతంలో ఇచ్చిన హామీలు నెరవేర్చారా? (పాత అభ్యర్థి అయితే) మహిళల భద్రత ప్రజల భద్రత కోసం చేపట్టే చర్యలు ఏమిటి? మహిళల భద్రత కోసం సీసీటీవీ కెమెరా లో ఏర్పాటు అసాంఘిక శక్తుల పై ఎలాంటి నిఘా ఏర్పాటు చేస్తారు?

**భవన నిర్మాణాల్లో అవినీతి నిర్మూలన**

భవన నిర్మాణ అనుమతుల్లో జరిగే అవినీతి ఎలా అరికడతారు. భవన నిర్మాణాల్లో సింగిల్ విండో సౌకర్యాలను ప్రజలకు అందుబాటులోకి తేవడానికి మీ వద్ద ఉన్న ప్రణాళిక ఏమిటి?

కాలుష్య రహిత పర్యావరణహిత పరమైన వార్డు/ డివిజన్/ పట్టణాన్నీ / నగరాన్ని ఆరోగ్యవంతమైన సుందర నగరంగా నిర్మించడంలో ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన అభ్యర్థులు తమ బాధ్యతలను మరవద్దు. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాలను అమలు చేయడానికి సూక్ష్మ స్థూల స్థాయి ప్రణాళికలతో పట్టణాల సుస్థిరాభివృద్ధికి పాటుపడుతారని ఆశిద్దాం.

**నేదునూరి కనకయ్య**
**అధ్యక్షులు తెలంగాణ**
**ఎకనామిక్ ఫోరం**
**తెలంగాణ వికాస వేదిక**
**కరీంనగర్9440245771**



# కాంగ్రెస్ పాలన లో అన్ని స్క్యాంలే......

- **మోడీ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజల ఆదరణ....**
- **బీజేపీ మున్సిపల్ ఎన్నికల్లో విజయం ఖాయం....**
- **మాజీ రాజస్థాన్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ దేవ్ జీ పటేల్...**

**మెదక్ ఫిబ్రవరి 07 (ప్రజా స్వరం)**




మోడీ దేశంలో చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను చూసి ప్రజలు బీజేపీ పార్టీ అభ్యర్థులకు బ్రహ్మరథం పడుతున్నారని మాజీ రాజస్థాన్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ దేవ్ జీ పటేల్ అన్నారు. శనివారం మెదక్ జిల్లా బిజెపి కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో అనేక అవినీతికి పాల్పడినట్లు బయటపడ్డాయని కానీ బిజెపి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఎలాంటి అవినీతికి తావు లేకుండా పాలన సాగిస్తుందన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిరుపేద కుటుంబాల్లో సంతోషం చూసేందుకు అనేక సంక్షేమ అమల్లోకి తీసుకొచ్చిందన్నారు. కాంగ్రెస్ పాలనలో తన కుటుంబాన్ని అభివృద్ధి చేస్తుందని దేశ ప్రజలను పట్టించుకోలేదన్నారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత పేద ప్రజల సుఖ సంతోషాలతో ఉండేందుకు కృషి చేస్తుందన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో మోదీ సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రచారం లో మోదీ సంక్షేమ అభివృద్ధి పథకాలను చూసి బిజెపి అభ్యర్థులను ఆదరిస్తున్నారు. ప్రజల్లో బిజెపి పార్టీ ఉందని జరగబోయే మున్సిపల్ ఎన్నికల్లో బిజెపి జెండా ఎగరడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎన్నికల ఇంచార్జీ సంగమేశ్వర్, బీజేపీ జిల్లా



ప్రధాన కార్యదర్శి రంజిత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కల్కి నాగరాజు, మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్, తదితరులు పాల్గొన్నారు

# మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయం.....

- **ఇందిరమ్మ రాజ్యంలోని పల్లె, పట్టణాల అభివృద్ధి.....**
- **ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్....**

**మెదక్ ఫిబ్రవరి 07 (ప్రజా స్వరం)**

ఇందిరమ్మ రాజ్యంలోనే పల్లెలు పట్టణాలు బాగు చేయాలనే లక్ష్యం తో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తుందని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. శనివారం మెదక్ పట్టణంలోని 5, 7, 10, 27 వార్డుల్లో మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలు మర్చిపోలేదన్నారు. మెదక్ పట్టణం అభివృద్ధి చెందాలంటే అధికార కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్న విషయాన్ని ప్రజలు గుర్తించి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకొని మెదక్ గడ్డ పై కాంగ్రెస్ జెండా ఎగురవేయాలన్నారు. అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో





మాజీ మున్సిపల్ చైర్మన్ లు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# సిపిఎస్ రద్దుచేసి ఓ పి ఎస్ విధానాన్ని అమలు చేయాలి..

- **తపస్ రాష్ట్ర అధ్యక్షులు వోడ్నాల రాజశేఖర్**

**పాపన్నపేట ఫిబ్రవరి 07 ( ప్రజా స్వరం )**

తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం మెదక్ జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం పాపన్నపేట మండలం ఏడుపాయలలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తపస్ రాష్ట్ర అధ్యక్షులు వోడ్నాల రాజశేఖర్ హాజరై, మాట్లాడుతూ సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి ఓపిఎస్ విధానం అమలు చేస్తామన్న హామీని ప్రభుత్వం నిలబెట్టుకోవాలని, పి ఆర్ సి కమిటీ నివేదికను బహిర్గతం చేయాలని, పెండింగ్ డీఏ లను వెంటనే ప్రకటించాలని, టెట్ రద్దు అంశాన్ని కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి రద్దు చేయడానికి ప్రయత్నం చేస్తామని, జిపిఎఫ్ పెండింగ్ బకాయిలను వెంటనే ప్రభుత్వం చెల్లించాలని, ఆర్థికపరమైన అంశాలు నెరవేర్చకపోతే రాష్ట్ర రాజధానిలో ధర్నా చేస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మెదక్ జిల్లా తపస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జిడ్డి ఎల్లం, జలా సిద్ధు, రాష్ట్ర బాధ్యులు దుబాషి భాస్కర్, దేశ్ భాస్కర్, చల్లా లక్ష్మణ్, రంగారెడ్డి, ఆర్వీ రామారావు, వెంకటస్వామి, జిల్లా బాధ్యులు మంగ నర్సింలు, సప్న శ్రీ, రేఖ సుజాత, ఉమాదేవి, భాగ్య, సాగరిక, అర్చన, రామచందర్, చక్రవర్తి, నాగిరెడ్డి, శ్రీధర్ రెడ్డి, ఈగ కృష్ణ మూర్తి, మల్లేష్, పోచయ్య, మెట్టు శేఖర్, నాయిని నరేందర్, రాజు, యాదగిరి, కొలవేణు, దుర్గాప్రసాద్, ప్రసాద్ రెడ్డి, బిక్షపతి, సంతోష్, అల్లం ఆంజనేయులు, శ్రీకాంత్ రెడ్డి, సుభాష్, దేశపతి కృష్ణమూర్తి, వినోద్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



## అండగా ఉండి అభివృద్ధి చేస్తా గెలిపించండి...

- **1 వ వార్డులో కప్ప రజిత భాస్కర్ ఇంటింటి ప్రచారం...**

**గజ్వేల్ ఫిబ్రవరి 07 (ప్రజాస్వరం):**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డులో స్వతంత్ర అభ్యర్థి కప్ప రజిత భాస్కర్ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రతి ఇంటిని సందర్శిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని, తమకు మద్దతు ఇవ్వాలని ఓటర్లను కోరారు. ఇంటింటి ప్రచారంలో భాగంగా పారిశుధ్యం, తాగునీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు వంటి మౌలిక వసతుల సమస్యలను ప్రజలు అభ్యర్థి దృష్టికి తీసుకువచ్చారు. వీటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానని కప్ప రజిత భాస్కర్ హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, "వార్డు అభివృద్ధే నా లక్ష్యం. ప్రజల నమ్మకంతో గెలిచి, వార్డును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాను" అని తెలిపారు.ఈ ఇంటింటి ప్రచార కార్యక్రమంలో స్థానికులు, మద్దతుదారులు పాల్గొని స్వతంత్ర అభ్యర్థికి తమ మద్దతు తెలిపారు.

## వివేకానంద విద్యాలయంలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం..

**రామాయంపేట, ఫిబ్రవరి 07 (ప్రజా స్వరం )**

రామాయంపేట పట్టణంలోని స్థానిక వివేకానంద విద్యాలయంలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులలో క్రమశిక్షణ, బాధ్యతాయుతమైన పౌరసత్వాన్ని పెంపొందించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఏ.రామ్ కుమార్ అన్నారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తరగతులు నిర్వహించడం వల్ల పాఠశాల నిర్వహణ ఎలా జరుగుతుందో కూడా ప్రత్యక్షంగా అర్థం చేసుకుంటారన్నారు. తదనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులు తమ అనుభవాలను ఉపాధ్యాయులతో పంచుకున్నారు. ఉపాధ్యాయులుగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు, ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయుల చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. కాగా ఈ కార్యక్రమంలో డీఈవోగా బి.తేజస్విని, ఎంఈఓగా ఎస్.హర్షిత, ప్రధానోపాధ్యాయురాలిగా ఏ.రశ్మిత వ్యవహరించారు.




# మోసపూరిత హామీలిచ్చే కాంగ్రెస్ ను ఓడించండి

- **తూప్రాన్ మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో : మాజీ మంత్రి హరీష్ రావు...**

**తూప్రాన్ ఫిబ్రవరి 7 (ప్రజాస్వరం)**



మెదక్ జిల్లా తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న తన్నీరు హరీష్ రావు కు బైక్ ర్యాలీ తో ఘన స్వాగతంపలికారు హరీష్ రావు సభలో మాట్లాడుతూ..తూప్రాన్ కు తాగునీరు కష్టాలు తీరిచ్చింది మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ 2000 రూపాయలు పెన్షన్ ఇచ్చి నిరుపేదలను ఆదుకున్న ఘనతా మాజీ ముఖ్యమంత్రి అని ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్ పార్టీ మహిళల ఖాతాలో 2500 వేస్తా అన్న ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి మహిళలకు 65000 బాకీ పడ్డారని తెలిపిన హరీష్ రావు అన్నారు

కళ్యాణ లక్ష్మి తులం బంగారం ఇస్తానన్న ముఖ్యమంత్రి బంగారం ధరలు పెంచారు కెసిఆర్ ప్రభుత్వ హాయంలో భూముల ధరలు పెరిగి మనుషుల విలువలు పెరిగాయి, కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలో భూముల ధరలు పాతలానికి బంగారం ధరలు పెరిగిపోయాయి ఆకాశానికి చేరాయన్నారు రియల్ ఎస్టేట్ ధరలు పడిపోయి భూముల ధరలు అడుగంటిపోయాయి

తూప్రాన్ మున్సిపాలిటీలో రోడ్లపై ఏర్పడిన గుంతలలో డాంబర్ కూడా పోయలేని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వ ఆసుపత్రుల్లో డాక్టర్లు కూడా ఉండడం లేదు తూప్రాన్ లో కాంగ్రెస్ పార్టీ నాయకులు నర్సారెడ్డి, మైనంపల్లి హనుమంత రావు మధ్య ఆధిపత్య పోరు కొనసాగుతుంది ఆదిపత్య పోరు అవసరమా,, అభివృద్ధి అవసరమా ప్రజలు తెలుసుకోవాలి అని ఆయన అన్నారు కెసిఆర్ ప్రకటించిన 25 కోట్ల అభివృద్ధి నిధులను నిలిపివేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మున్సిపాలిటీలో ఆస్తిపన్ను పెంచి నిరుపేదలను ఇబ్బంది పెడుతున్నకాంగ్రెస్ ప్రభుత్వం తూప్రాన్ మున్సిపాలిటీలో జరిగిన అవినీతిపై టిఆర్ఎస్ ప్రభుత్వం విచారణ చేపడుతుంది నల్లధనాన్ని తీసుకువస్తానన్న నరేంద్ర మోడీ ప్రజల ఖాతాల్లో 12 సంవత్సరాలుగా 15 లక్షలు జమ చేయడం లేదు సంవత్సరానికి రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని కేంద్ర ప్రభుత్వం మోసం చేసింది తెలంగాణకు వ్యతిరేకంగా బిజెపి వ్యవహరిస్తుంది, ఒక్క జాతీయ ప్రాజెక్టు కూడా తెలంగాణకు కేటాయించలేదు అని మండిపడ్డారు ఈ కార్యక్రమంలో గజ్వేల్ టిఆర్ఎస్ ఇంచార్జ్ వంటేరు ప్రతాపరెడ్డి మాజీ మున్సిపల్ చైర్మన్ బొంది రవీందర్ గౌడ్ బాబుల్ రెడ్డి ఆంజనేయులు గౌడ్ హరికృష్ణ గౌర్రె వెంకట్ రెడ్డి రాణి సత్యనారాయణ గౌడ్ ఉమాశంకర్ 16 వార్డుల అభ్యర్థులు రజిని అవినాష్ రెడ్డి సత్యలింగం జయపాల్ రాథోడ్ చెలిమెల ప్రియాంక సమంతా రెడ్డి రాధా శ్రీనివాస్ ఐలేష్ బొంది అరుణ వెంకట్ తదితరులు పాల్గొన్నారు








## కాంగ్రెస్ తోనే అభివృద్ధి సాధ్యం మంత్రి అజారుద్దీన్..

**తూప్రాన్ ఫిబ్రవరి 7 (ప్రజాస్వరం)**

తూప్రాన్ మున్సిపాలిటీలో ఒకటో వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించిన మంత్రి అజారుద్దీన్.. తూప్రాన్ బస్టాండ్ వద్ద ఏర్పాటుచేసిన మైనార్టీ సమావేశంలో మాట్లాడుతూ తూప్రాన్ మైనార్టీ సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు గజ్వేల్ ఎమ్మెల్యే ఫామ్ హౌస్కే పరిమితమయ్యాడని అలాంటి నాయకుడు మనకు వద్దు అని ఆయన అన్నారు కాంగ్రెస్ పార్టీ 16 వార్డుల అభ్యర్థులను గెలిపించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి తూప్రా మున్సిపల్ ఇంచార్జ్ బండ రమేష్ ఎలక్షన్ రెడ్డి భాస్కర్ రెడ్డి నారాయణ గుప్తా రవీందర్ గుప్తా మామిళ్ళ జ్యోతి కృష్ణ పెయింటర్ శ్రీనివాస్ సుల్తాన్ సబిత నాగేష్ షారుక్ ఆఫ్రాన్ డాక్టర్ అప్సర్ భారీగా మైనార్టీ మహిళలు యువకులు పాల్గొన్నారు

# ప్రభుత్వ స్థలం కాదు..

- **ప్రైవేట్ భూమి-గువ్వ రవి ముదిరాజ్**

**మేడ్చల్, (ప్రజాస్వరం):**



జిహెచ్ఎంసి మేడ్చల్ డివిజన్లోని సర్వే నంబర్ 1045/1 లోని స్థలాన్ని కొందరు రియేటర్లు కబ్జా చేశారని, స్థానిక ఉమా వెంకట్ రెడ్డి కాలనీ వాసులు చేసినటువంటి ఆరోపణలు నిజం కావని గువ్వ రవి ముదిరాజ్ అన్నారు. శనివారం గువ్వ రవి ముదిరాజ్ మీడియాతో మాట్లాడుతూ.. 1977లో స్థానిక మేడ్చల్ ఎమ్మెల్యే ఉమా వెంకట్ రెడ్డి పేదల కోసం స్థలం కొనుగోలు చేసి ల్యాండ్ ఆక్విజేషన్ జరిపి 132 మంది పేదలకు ఇండ్ల స్థలాలను ఇచ్చారని చెప్పారు. అప్పటి ఎమ్మెల్యే ఉమా వెంకట్ రెడ్డి 5 ఎకరాల 36 గుంటల విస్తీర్ణం గల భూమిని కొనుగోలు చేయగా 5.7 ఎకరాల్లో ప్రభుత్వం ద్వారా ల్యాండ్ ఆక్విజేషన్ చేయించి పేదలకు ఇండ్ల స్థలాల కేటాయింపు జరిపినట్లు తెలిపారు. మిగిలిన 27 గుంటల భూమిలోనుండి కొద్ది రోజుల అనంతరం 14 గుంటల భూమిని ఎస్టీ హాస్టల్ కు ఇచ్చారని అన్నారు. చివరిగా మిగిలిన 13 గుంటల పట్టా భూమి ఉమా వెంకట్ రెడ్డి పేరు పైనే ఉందని స్పష్టం చేశారు. 2007లో వీర్లపల్లి శ్రీలత, జంబుల నరసింహారెడ్డి ఉమా వెంకట్ రెడ్డి నుండి న్యాయబద్ధంగా స్థలాన్ని కొనుగోలు చేశారని చెప్పారు. ఇదే విషయమై కొందరు స్థానికులు అదే సమయంలో కోర్టును ఆశ్రయించగా, పూర్తి డాక్యుమెంట్లను పరిశీలించిన కోర్టు అది ప్రభుత్వ స్థలం కాదని ప్రైవేట్ స్థలమని తీర్పునిచ్చినట్లుగా గువ్వ రవి ముదిరాజ్ మీడియా ముఖంగా వెల్లడించారు. 2017 సంవత్సరంలో వీర్లపల్లి శ్రీలత, నరసింహారెడ్డిల వద్ద నుండి స్థలాన్ని కొనుగోలు చేశానని చెప్పారు. అసత్యపు ఆరోపణలు చేసే ముందు నిజానిజాలు తెలుసుకోవాలని ఆయన స్థానికులను అన్నారు. కోర్టు తీర్పు ఉన్నప్పటికీ అసత్యపు ఆరోపణలు చేయడం సరికాదని గువ్వ రవి ముదిరాజ్ మండిపడ్డారు.

## రైలు పట్టాలపై వ్యక్తి ఆత్మహత్య ..

**తూప్రాన్ ఫిబ్రవరి 7 (ప్రజాస్వరం )**

తూప్రాన్ మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో బ్రాహ్మణపల్లి చెందిన శివ పొట్టి రమేష్(40) అనే వ్యక్తి రైలు పట్టాలపై ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటుచేసుకుంది శనివారం సాయంత్రం బ్రాహ్మణపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో ఎదురుగా వస్తున్న రైలుకు అడ్డంగా వెళ్లి ఆత్మహత్య చేసుకున్నారు ఆత్మహత్య గల కారణాలు తెలియాల్సి ఉంది కామారెడ్డి పోలీసులు శవ పంచనామ చేసి శవాన్ని కామారెడ్డి ఆస్పత్రి తరలించారు

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PURAM MAHESHWAR PRINTED AT HARI HARA ART PRINTERS, H.NO. 6-185, TOOPRAN, DIST. MEDAK, TELANGANA-502336. AND PUBLISHED AT H.NO. 4-50/18, KALLAKAL, VILL-KALLAKAL,(PO), KALLAKAL, (M) MANOHARABAD, DIST, MEDAK, TELANGANA-502336,
EDITOR : PURAM MAHESHWAR. RNI NO : TELTEL/2006/17154, CELL : 8008609999